# తెలుగువాడు పైకొస్తున్నాడు - తొక్కేయండి!

*(ఈ కథ నిజంగా అమెరికాలో జరగలేదు. తెలుగువాళ్లున్న ప్రతిచోటా, మన 'తెగులు' తనాన్ని చూపించే ఈ కథ జరిగే అవకాశం వుంది కనుక, ఈ కథకు ఒక ప్రదేశం అవసరం కనుక - ఈ కథ అమెరికాలో జరిగినట్టు వ్రాశాను - రచయిత)*

అమెరికాలో ప్రపంచ తెలుగు మహాసభలు.

అన్ని రంగాలలోనూ ఎంతో విశిష్టంగా పనిచేసినవారిని సన్మానించాలని మహాసభల కార్యవర్గం వారు నిర్ణయించారు. ఈ మహసభల వారే సన్మానితులను ఎన్నుకోవచ్చుకాని, బంధు ప్రీతి, రాజకీయాలు వస్తాయని, ఆ విశిష్టులయిన వ్యక్తులను ప్రజలే ఎన్నుకుంటే బాగుంటుందని నిర్ణయించారు. ప్రతి నెలా సభ్యులకు పంపించే మాసపత్రికలో ఈ విషయం వ్రాసి, సన్మానానికి, అర్హులయిన వారిని ప్రతి ఒక్కరినీ కనీసం యిద్దరు వ్యక్తులను వ్రాత పూర్వకంగా ప్రతిపాదించవలసిందిగా కోరారు. ఒక నెల రోజులు వ్యవధి కూడా యిచ్చారు.

సూర్య చాల గొప్ప రచయిత. ఇండియాలో వున్నప్పుడూ, తర్వాత అమెరికా వచ్చాక - దాదాపు రెండు వందల కథలు, నవలలూ వ్రాసి మంచి అభ్యుదయ భావాలు కల రచయితగా చాల పేరు పొందాడు. అమెరికాలో వున్న పది - పదిహేను పేరుపడ్డ రచయితలకు కూడా అతనంటే చాల గౌరవం. తన పేరుని సన్మానానికి ప్రతిపాదిస్తారని సూర్యం గట్టిగా అనుకున్నాడు. అమెరికాలో సర్‌ప్రైజు పార్టీలు ఎక్కువ. అలాగే అతని నామినేషన్ కూడా ఆశ్చర్యకరంగా వుంటుందని, చివరి నిమిషం దాకా బయటకు రాదని అనుకున్నాడు సూర్యం.

మాధవి ఒక టెలిఫోన్ కంపెనీలో ఇంజనీరు. ఆవిడ ఒక కంప్యూటర్ ప్రోగ్రాం డెవలప్ చేసింది. దానివల్ల దూర ప్రదేశాలకు ఫోన్ చేసినప్పుడు, ఏ లైను బిజీగా లేదో చూసి, ఆ లైనుకు, ఆ ఫోన్ కాల్‌ని మరక్షణంలో కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారా వెంటనే కనెక్ట్ చేయిగలుగుతారు. దానివల్ల ఆలస్యం లేకుండా, వెంటనే ఫోన్ చేయివచ్చు. మాధవి డెవలప్ చేసిన ఈ ప్రోగ్రాం వలన ఫోన్ కంపెనీ చాల లాభాలు చేసుకుంది. ఆవిడకు ఎక్కువ జీతం యిచ్చి ప్రమోషన్ మీద సీనియర్ లెవల్ ఉద్యోగం కూడా యిచ్చారు. ఆవిడ సాంకేతికంగా గణనీయమైన పనిచేసిందని పేపర్లలో వ్రాశారు కూడాను. రచ్చగెలిచిన తెలుగు ఆడపడుచుకు మన యింట సన్మానం జరుగుతుందనుకోవటంలో వింత ఏముంది?

రాధారాణికి మరోపేరు నాట్యరాణి. ఆవిడ మద్రాసులో వెంపటి చిన్న సత్యం గారి దగ్గర నృత్యం నేర్చుకుని, అన్ని దేశాలలోనూ చక్కటి ప్రదర్శనలు యిచ్చింది. తర్వాత అమెరికాలో సెటిల్లయిపోయి, ఒక నృత్య కళాశాల పెట్టి, ఆ కూచిపూడి నృత్య సంపదను, అందరికీ నేర్పుతూ చాల పేరు గడిచింది. ఆవిడ నృత్యం, భారతీయులనే కాకుండా చాల

మంది అమెరికన్లను కూడా రంజింపచేసింది. ఆవిడ పద విన్యాసం, నెమలికి నడకలు నేర్పే అంత ముగ్ధమనోహరంగా వుంటుందిమరి. ఆవిడ నృత్యం చూసినవారికందరికీ తెలుసు, ఈ సారి నృత్య రంగంలో ఆవిడకే సన్మానం అని.

అప్పారావ్‌గారు యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ప్రొఫెసర్. ఆయన బయోకెమిస్ట్రీలో చాల పేరు ప్రఖ్యాతులు పొందారు. ఎన్నో పేపర్లు వ్రాసి, పిహెచ్‌డీలను తయారు చేయటమే కాకుండా, ఆయన చేసిన రీసెర్చి ఫలితంగా, కాన్సర్ తగ్గించేందుకు మంచి మందులు తయారు చేసే అవకాశం కూడా లభించింది. నోబుల్ ప్రైజు కోసం మిగతా అమెరికన్ ప్రొఫెసర్లు ఆయన పేరును ప్రతిపాదించారు. కానీ అదే సమయంలో "ఎయిడ్స్" రీసెర్చిలో పనిచేసిన ఒక అమెరికన్‌కి యివ్వడంతో, ఈయనకు నోబుల్ ప్రైజు రాలేదు. అప్పారావ్ గారు ఈ తెలుగు మహాసభలలో సన్మానించబడటానికి అర్హుడు అని అందరి నమ్మకమూనూ.

నెల రోజులు గడిచాయి. ఈ సన్మానం కమిటీలో మెంబరు సారధి. మిగతా కమిటీ వారితో కలసి, ఈ ప్రతిపాదనలను పరిశీలించవలసి వుంది. అందుకే ఆ రోజు ప్రొద్దున్నే ఫోన్ చేసి, ఆ కమిటి కన్వీనరు శంకర్‌ని అడిగాడు - ఎన్ని పేర్లు ప్రతిపాదించబడ్డాయి, వివరాలు చెప్పమని. ఆయన చెప్పుకోదగ్గ నామినేషన్లు ఏమీ రాలేదనీ, కమిటీ వాళ్లే ముందుకు వచ్చి కొన్ని పేర్లు ప్రతిపాదించవలసిన అవసరం వచ్చిందనీ అన్నాడు. సారధికి ఆశ్చర్యం వేసింది. అతన్ని ఈ కమిటీలో వేసినప్పుడు, చాల నామినేషన్లు వస్తాయనీ వాటిలో నుంచీ కొంతమందిని మాత్రమే సన్మానించటానికి ఎన్నుకోవటం చాల కష్టతరమైన పని అనీ అనుకున్నాడు. కానీ... ఇదేమిటి ఇలా.... అదే అన్నాడు శంకర్‌తో.

ఆయన కూడా తనకీ ఆశ్చర్యంగానే వుందన్నాడు. ఎన్నో రంగాల్లో ఎంతో మంది హేమాహేమీలు వుండగా, ఎవరి పేరూ రాకపోవటం ఆయనకీ వింతగానే వుంది మరి.

ఆ రోజు రాత్రి కెనడాలో తన బావమరిది రామారావ్‌ని ఫోనులో పిలిచి ఏవో కుటుంబ విషయాలు మాట్లాడాడు సారధి. రామారావ్ భార్య లక్ష్మి. ఆవిడ అటు వేదాంతం, ఇటు సైన్సు రెండింటినీ కలిపి చక్కగా మాట్లాడుతుంది. చిన్మయానంద ఉపన్యాసాలు, పి. హెచ్.డి. రెండింటి ప్రభావమూ కనిపిస్తుంది ఆవిడలో. ఆవిడతో మాటవరసకు ఈ సన్మానాల భాగోతం చెప్పాడు సారధి.

"సారధీ - నాకొక కథ గుర్తుకొస్తున్నదయ్యా - నువ్వామాట చెప్పగానే. పరంధామయ్య నామధేయుడయిన ఒకాయనకు కాలం చెల్లి, పైనించి పిలుపు రాగానే పరమపదించాడు. ఆ పరంధామయ్యగారు పుణ్యాలూ, పాపాలూ సమానంగా చేయటం వలన, అటు స్వర్గానికి కానీ, ఇటు నరకానికి కానీ, ఎక్కడికయినా వెళ్లవచ్చునని తీర్మానించాడు చిత్రగుప్తుడు. పరంధామయ్యగారు, స్వర్గాన్నీ, నరకాన్నీ రెండిటినీ తన కళ్లతో చూసి, ఎక్కడ బాగుంటే అక్కడికి వెడతానని చెప్పారు చిత్రగుప్తుడితో. చిత్రగుప్తుడు సరేనని, ఆయన్ని ముందుగా నరక యాత్రకు తీసుకువెళ్లాడు. కథల్లో వ్రాసినట్టు అక్కడ సలసలా కాగుతున్న నూనెలో ఎవర్నీ మిరపకాయ బజ్జీల్లా వేయించడంలేదు. కాళ్లల్లోనూ, చేతుల్లోనూ, సూదులు, గునపాలూ గుచ్చటంలేదు. అంతా శుభ్రంగా చక్కగా వుంది. మంచి మంచి ఆహార పదార్థాలు చేసి మధ్యలో ఒక బల్ల మీద చక్కగా అమర్చి పెట్టారు. ప్రక్కనే రకరకాల పళ్లు,

పాలూ తదితర సురాసుర పానీయాలు (అంటే అమృతం + విస్కీ లాంటివన్నమాట) అన్నీ వున్నాయి. చాల అందమైన అప్సరసలు, మనోహరంగా అలంకరించుకుని, అర్ధనగ్నంగా నృత్యం చేస్తున్నారు--"

"పరంధామయ్యగార్ని నరకానికి బదులు పొరపాటున స్వర్గానికి తీసుకువెళ్లారేమో!' ' అన్నాడు సారధి.

నవ్వింది లక్ష్మి - "అదేమీ కాదు - నరకానికే - కాకపోతే ఒకటే చిక్కు. అక్కడి మనుష్యులు అచ్చం మనలాగానే వున్నా, చేతులు మాత్రం బాగా చిన్నవిగా వున్నాయి. ఏదన్నా తీసుకుని తినబోతే చేతులు నోటి దాకా రావటం లేదు. అందుకే అక్కడ అంత మృష్టాన్న భోజనం వున్నా తినటానికి వీలులేదు. అలాగే అక్కడ వున్న అందరికీ కళ్లకు గంతలు కట్టివున్నాయి. కట్టు విప్పుకుందామంటే, ఆ చిన్న చేతులకు కళ్లు అందటంలేదు. అందుకే అప్సరసలు మనోహరంగా నృత్యం చేస్తున్నా చూసి ఆనందించే అదృష్టం లేదు. నరక యాతన అనుభవిస్తున్నారు. పరంధామయ్యగారు వాళ్ల మీద జాలిపడి - ఈ సారి స్వర్గయాత్రాస్పెషల్ ఎక్కారు చిత్రగుప్తుడితో సహా. స్వర్గం కూడా చూడటానికి అచ్చం నరకం లాగానే వుంది. ఏమీ తేడా లేదు. అన్ని రకాల ఆహార, పానీయ పదార్థాలు, నరకంలో లాగానే చక్కగా అమర్చబడి వున్నాయి. అప్సరసలు నాట్యవిన్యాసం చేస్తున్నారు. అక్కడి మనుష్యులకు కూడా చేతులు బాగా చిన్నవిగా వున్నాయి అచ్చం నరకంలోలాగానే. వాళ్ల కళ్లకు కూడా గంతలు కట్టివున్నాయి-" లక్ష్మి చెబుతున్న మాటలకు అడ్డం వచ్చి అన్నాడు సారధి.

"నువ్వు మళ్లీ 'ఇన్‌స్టెంట్ రీప్లే' చేస్తున్నావ్ - స్వర్గం కూడా అచ్చం నరకంలాగానే ఎలా వుంటుంది?"

లక్ష్మి నవ్వింది - "అసలు స్వర్గానికీ, నరకానికీ ఏమీ తేడా లేదు. వున్న తేడా అంతా ఆ మనుష్యుల..."

"వాళ్లల్లో మాత్రం తేడా ఏముంది. నోటికి అందని చేతులతో వాళ్లేం తింటారు? చూడలేని కళ్లతో వాళ్లేం ఆనందిస్తారు?" అన్నాడు సారధి, ఈ అర్థంలేని కథతో, ఫోన్ బిల్లు పెరిగి పోతున్నదనే బాధతో.

"అదేనయ్యా నేను చెబుతున్నది. స్వర్గానికీ, నరకానికీ భౌతికంగా ఏమీ తేడా లేదు. మనుష్యుల ఆకారంలో కూడా ఏమీ తేడా లేదు. ఉన్న తేడా అంతా వాళ్ల ప్రవర్తనలో వుంది. వాళ్ల ఆలోచనలో వుంది. మంచి మనస్సుల్లో వుంది. అందుకే వీళ్లు స్వర్గంలో వున్నారు. వాళ్లు నరకంలో వున్నారు. వీళ్ల చేతులు చిన్నవి కావటం వలన, నోటినీ, కళ్లనీ, అందుకోలేక పోతున్నారు. అయినా వీళ్లు స్వలాభాపేక్షకులు కారు. అందుకే ఒకళ్ల కళ్ల గంతలు యింకొకళ్లు విప్పుతున్నారు. ఆ చిన్న చేతులకు అందేంత దగ్గరగా వచ్చి, ఒకళ్ల కొకళ్లు సహాయం చేసుకుంటున్నారు. అలాగే ఆ ఆహారం ఒకళ్ల కొకళ్లు తినిపిస్తున్నారు. ఎవరి ఆహారం వాళ్లు తినకుండా యింకొకళ్లకు అందిస్తున్నారు. వాళ్లు యిచ్చినవి తింటున్నారు. అందరి ముఖాలలోనూ సంతృప్తి, ఆనందం. అప్సరసల నృత్యాన్నీ ఆనందిస్తున్నారు. నవ్వుతూ, స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటున్నారు. స్వర్గం అన్నదానికి అర్థం చూపిస్తున్నారు!"

సారధికి ఈ కథ చాల బాగా నచ్చింది. కానీ లక్ష్మి ఆ కథ ఎందుకు చెప్పిందో మాత్రం

అర్థం కాలేదు.

"ఇప్పుడు ఈ కథ నాకెందుకు చెప్పావ్?" అడిగాడు సారధి.

"ఆలోచించు!" నవ్వుతూ ఫోన్ పెట్టేసింది లక్ష్మి.

ఫోన్ పెట్టేశాక అర్థమయింది సారధికి.

ఎప్పుడో, ఎక్కడో, ముళ్లపూడి వెంకటరమణగారు వ్రాశారు కూడాను. ఒక తెలుగువాడు ఇంకొక తెలుగువాడి గొప్పతనాన్ని, గుర్తించడని. మంగళంపల్లి బాలమురళీకృష్ణకి, సంగీత విద్వాంసుడుగా కీర్తి, ప్రతిష్ట, ఆంధ్రదేశంలో కాదు తమిళనాడులో లభించింది. ఆ కీర్తి ప్రతిష్టలు వచ్చాక - 'ఓహో ఈయనా తెలుగువాడే' అనుకున్నాం. ముప్ఫయి అయిదేళ్ల 'బాపు'గారి కార్టూనులు, కథలకు వేసిన బొమ్మలు మాత్రమే చూసి ఆనందించి - ఆయన ఒక గొప్పవాడు అనుకుంటున్న నాకు, ఈ మధ్య హ్యూస్టన్‌లో ఆయన రంగుల చిత్రాలు చూసిన తర్వాత, ఈయన అంత మహాగొప్పవాడు ఇంకెక్కడయినా వుంటాడా అని ముక్కు మీద వేలు వేసుకున్నాను. కానీ ఆయన పేరు తెలుగు దేశందాటి బయటకు రాలేదు. తెలుగు దేశంలో కూడా ఆయన సినిమాలు తీసుకునే బాపు, దీపావళి సంచికలకు అట్ట మీద బొమ్మవేసే బాపు మాత్రమే. అంతర్జాతీయంగా ఎవరికీ తీసిపోని బాపు, ఆంధ్రదేశపు పొలిమేరలు దాటి బయటకు రాకుండా జాగ్రత్త పడ్డాం, మన తెలుగు వాళ్లం. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'కృష్ణపక్షం' శ్రీశ్రీ 'మహాప్రస్థానం' బాలగంగాధర తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' - 'గీతాంజలి'కి తీసిపోయాయా? కనీసం మన రాజకీయ నాయకులకయినా, ఇలాంటి గొప్ప కవులను 'జ్ఞాన పీఠా'నికి ఎక్కించాలన్న జ్ఞానం వున్నదా?

"బెంగాలీస్ ఆర్ గుడ్ యిన్ లిటరేచర్!" అని ఇంగ్లీషులో అన్న బెంగాలీ అర్థంకాని తెలుగూ ఆయన, కనీసం ఈ పుస్తకాలు కొనకపోయినా, అద్దెకు తెచ్చుకునో, లైబ్రరీలో అప్పు తెచ్చుకునో, పార్కు బెంచీలో పక్కవాడి ఒడిలో తలపెట్టుకునో, చదవచ్చు కాదా!

వెంపటి చిన్న సత్యం గారు, ఆంధ్రుల కళా కుసుమం కూచిపూడి నృత్యాన్ని, మద్రాస్‌లో పోషిస్తున్నారు. "కూచిపూడి ఎవరికి కావాలండీ, సిల్క్ స్మిత కావాలి కాని" అన్నాడు ఒక తెగులు పెద్ద మనిషి.

ప్రపంచ కథల పోటీలో బహుమతి తెచ్చుకున్న ఒకే ఒక తెలుగు కథ "గాలివాన" వ్రాసిన పాలగుమ్మి పద్మరాజు గారు ... ఎవరూ పాలగుమ్మి పద్మరాజు గారా - ఆయనెవరు?

రచయిత సూర్యంగారూ, సైంటిస్ట్ అప్పారావ్‌గారూ, నాట్యరాణి రాధారాణి, ఇంజనీరు మాధవీ - వాళ్ల నామినేషన్ యింకెవరయినా చేస్తారని ఆశతో కూర్చున్నారు కానీ, వాళ్ల కన్నా గొప్పవాళ్లు ఇంకా చాలా మంది వున్నారనీ, వాళ్లను ప్రతిపాదించి సన్మానించటం, మన తెలుగుతనానికే సన్మానం అనీ అనుకుని వుంటే, మన తెలుగు వాళ్లు ఇంత తెర వెనుక ఎందుకు వుంటారు?

గిరీశం అంతటివాడు "మనవాళ్లు ఒట్ఠి వెధవాయిలోయ్" అని ఎందుకు అని వుంటాడు. మన తెలుగు వాళ్లు , ఒకళ్ల కళ్ల గంతలు యింకొకళ్లు తొలగిస్తే ఎంత బాగుంటుంది. ఒకళ్ల నోటికి, యింకొకళ్లు ఆహారం అందిస్తే అందరి కడుపూ నిండుతుంది కదా! అంతకన్నా స్వర్గం యింకెక్కడయినా వుంటుందా!?